సాక్షి
శ్రీకాకుళం
మంగళవారం । 1 । అక్టోబర్ । 2024



మానవత్వమే ప్ర'దానం'

రక్తదానంపై ఇంకా అవగాహన పెరగాల్సి ఉంది. నేడు జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం. - 8లో



దొంగలు దొరికారు

పలు చోరీ కేసుల్లో దొంగలను పోలీసులు పట్టుకున్నారు. బంగారం రికవరీ చేశారు. - 8లో

టెట్ నిర్వహణకు ఏర్పాట్లు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో టెట్ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఎచ్చెర్లలో రెండు పరీక్ష కేంద్రాలు, నరసన్నపేటలో ఒక పరీక్ష కేంద్రం, బరంపురంలో మూడు కేంద్రాలలో పరీక్ష జరుగుతుందని, అక్టోబర్ 3 నుంచి అక్టోబర్ 21వ తేదీ వరకు ఉదయం, మధ్యాహ్నం నిర్వహిస్తామన్నారు. ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారం కోసం 9703148269, 7989139860, 9494094904, 9177975250 నంబర్లను సంప్రదించాలన్నారు.

న్యూస్‌రీల్

450 మందితో పోలీసు బందోబస్తు



కోటబొమ్మాళిలో జాతరపై సమీక్షిస్తున్న ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

కోటబొమ్మాళి: కొత్తమ్మ తల్లి జాతరకు 450 మందితో పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నామని, సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూస్తామని ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి అన్నారు. కోటబొమ్మాళిలో జాతర నిర్వహణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన సోమవారం సమీక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, అమ్మవారి గర్భ గుడి, క్యూలైన్‌ల వద్ద ప్రత్యేక నిఘా వేయాలన్నారు.

గిరిజన మహిళల జీవన విధానంపై అధ్యయనం



గిరిజన మహిళలతో మహిళా సంఘ ప్రతినిధులు

కాశీబుగ్గ,పలాస: మందస మండలంలోని ఆదివాసీ గ్రామాల్లో ప్రగతిశీల మహిళా సంఘం ప్రతినిధి బృందం సోమవారం పర్యటించింది. అక్కడి మహిళల జీవన విధానాన్ని అధ్యయనం చేశారు. కొండలోగాం, బంసుగాం, కూల్లోగాం, పలాస మండలం లొత్తూరు, పెదగంతర, చిన్నగంతర, పెద్దపల్లియ, జెన్నాసాయి, చింతవీధి, తుసరాడ గ్రామాల్లోని మహిళల జీవన విధానంపై నిశితంగా పరిశీలన చేశారు. ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్.గంగాభవాని, రాష్ట్ర కార్యదర్శి పి.పద్మతో పాటు శ్రీకాకుళం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ, జిల్లా కోశాధికారి బర్ల జానకమ్మ, ఇతర కార్యవర్గ సభ్యులు కలిసి ఏజెన్సీ ప్రాంత మంతా పర్యటించారు. పోడు భూములు బాగు చేయడానికి ఉపాధి కూలీ 200 రోజుల పని దినాలు రోజుకి రూ.600 చొప్పున ఇవ్వాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను దగ్గరలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

డచ్ భవనంలో స్వచ్ఛతా హీ సేవ



డచ్ భవనం వద్ద కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కల్చరల్: గాంధీ జయంతిని పురస్కరించుకొని ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద ఉన్న డచ్ భవనంలో 2వ తేదీన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించనున్నారు. దీని కోసం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం భవనాన్ని పరిశీలించారు.

టీచర్లు ఓటు నమోదు చేసుకోండి

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో అర్హులైన ఉపాధ్యాయులందరూ ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని విశాఖ కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ సూచించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను అనుసరించి నోటిఫికేషన్ వెలువడిందని, ఆ మేరకు సోమవారం నుంచి ఓటు నమోదు ప్రక్రియ ప్రారంభమైందని నవంబర్ 6 వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్ మీటింగు హాలులో సోమవారం సాయంత్రం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన ఆయన వివిధ అంశాలపై సమీక్షించారు. వచ్చే ఏడాది మార్చి 29 నాటికి ప్రస్తుత ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గడువు ముగుస్తుందని, ఆ నేపథ్యంలో సంబంధిత ఓటర్ల జాబితా రూపకల్పనపై అధికారులు దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు సెకండరీ స్థాయికి మించిన పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీల్లో పని చేసే ఉపాధ్యాయులు, అధ్యాపకులు కూడా అర్హులేనని తెలిపారు. రెగ్యులర్ ప్రాతిపదికన లేదా అడ్-హక్ ప్రాతిపదికన పని చేస్తూ ఉన్నవారు మాత్రమే అర్హులని, పార్ట్ టైం విధానంలో చేసే వారు అర్హులు కారని స్పష్టం చేశారు. గతంలో ఓటు హక్కు ఉన్నా కొత్తగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి ఈఆర్ఓగా విశాఖపట్నం జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్ వ్యవహరిస్తారని తెలిపారు.

అమ్మ వచ్చే వేళ..

టెక్కలి, కోటబొమ్మాళి:

నేటి నుంచి కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లి ఉత్సవాలు
- మొట్ట మొదటిసారిగా రాష్ట్ర పండుగగా జాతర
- పకడ్బందీగా ఏర్పాట్లు

కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లి జాతరకు సర్వం సిద్ధమైంది. మొట్టమొదటిసారిగా రాష్ట్ర పండుగగా ఈ సారి ఉత్సవం నిర్వహించనున్నారు. మంగళవారం మొదలై గురువారం వరకు మూడు రోజుల పాటు జాతర జరగనుంది. ఏటా గ్రామస్తులు, ఉత్సవ కమిటీ సహకారంతో ఎంతో ఆర్భాటంగా నిర్వహించే ఈ ఉత్సవాలను ఈ ఏడాది మొట్టమొదటిసారిగా రాష్ట్ర పండుగ గుర్తింపుతో అధికార యంత్రాంగం నిర్వహించనుంది. మంత్రి అచ్చెన్నాయుడు, ఎంపీ కె.రామ్మోహన్‌నాయుడు ఆధ్వర్యంలో కలెక్టర్, ఎస్పీ, దేవదాయ ధర్మాదాయ శాఖాధికారులు ప్రత్యేకంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశా రు. ఈఓ వాకచర్ల రాధాకృష్ణ పర్యవేక్షణలో ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. అమ్మవారి దర్శనానికి జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వివిధ ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, వివిధ రంగాలకు చెందిన వీఐపీలు, అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో ఉత్సవాలకు సంబంధించి అమ్మవారితో పాటు ఆలయ ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అలాగే ప్రత్యేకంగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. గురువారం సాయంత్రం జరిగే ముర్రాటల ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.



కొత్తమ్మతల్లి అమ్మవారు

ప్రత్యేక కార్యక్రమాలు..



అలంకరణకు పువ్వులను సిద్ధం చేస్తున్న సిబ్బంది

కొత్తమ్మ తల్లి ఉత్సవాల్లో మొదటి రోజు మంగళవారం రాత్రి మెగా డ్యాన్స్ బేబీ డ్యాన్స్, రెండో రోజు బుధవారం రాత్రి తెనాలి కళాకారులతో దేవనర్తకి భక్త చింతామణి, 3వ తేదీ గురువారం రాజాం రంప జగదీశ్వర శర్మ నేతృత్వంలో శ్రీరామాంజనేయ యుద్ధం, అలాగే గయోపాఖ్యానం, సత్యహరిశ్చంద్ర తదితర నాటకాలు ప్రదర్శించనున్నారు.

అన్ని ఏర్పాట్లు చేశాం..



కొత్తమ్మ తల్లి ఉత్సవాలకు పూర్తి ఏర్పాట్లు చేశాం. మూడు రోజుల పాటు జరగనున్న ఉత్సవాల్లో భక్తులకు ఇబ్బందులు లేకుండా అందరి సహకారం తీసుకున్నాం. మొట్టమొదటి సారిగా రాష్ట్ర పండుగ గుర్తింపుతో ఉత్సవాలు నిర్వహిస్తున్నాం. - వి.రాధాకృష్ణ, ఆలయ ఈఓ

ఇదే చరిత్ర..

కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లి ఆలయ స్థల పురాణంపై ఓ గాథ ప్రచారంలో ఉంది. 1925లో కోటబొమ్మాళి గ్రామానికి చెందిన కమ్మకట్టు చినఅప్పలనాయుడు నారాయణవలస సంత ముగించుకుని ఎద్దులబండిపై తిరిగి వస్తుండగా ఓ మహిళ అప్పలనాయుడును ఆపి కోటబొమ్మాళి వరకు తనను తీసుకువెళ్లాలని కోరింది. దీంతో అప్పలనాయుడు సరే అన్నాడు. ఆమె బండి ఎక్కిన తర్వాత బండి బాగా బరువెక్కింది. బండి కోటబొమ్మాళి పొలిమేరకు వచ్చిన తర్వాత ఆమె పట్నాయకుని వెంకటేశ్వరరావుకు చెందిన తోటలోకి వెళ్లి అదృశ్యమైపోయింది. దీంతో అప్పలనాయుడు భయపడి వడివడిగా ఇంటికి చేరుకున్నాడు. అదే రోజు రాత్రి అప్పలనాయుడు కలలో ఆ మహిళ కనిపించి తాను పూసపాటి రాజులు కొలిచే ఆదిశక్తినని, తాను పట్నాయకుని వెంకటేశ్వరరావు తోటలో గల వేపచెట్టు, మునిడికి చెట్టు కలిసి ఉన్న ప్రదేశంలో పుట్ట వద్ద తన శక్తి నిక్షిప్తమై ఉన్నానని చెప్పడంతో ఆ ప్రాంతంలో పూజలు ప్రారంభించారు. ఏటా పోలాల అమావాస్య తర్వాత వచ్చే నవరాత్రుల్లో సంబరాలు చేయాలని చెప్పడంతో అప్పటి నుంచి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. కాలక్రమంలో ఆ శక్తి కొత్తమ్మ తల్లిగా కొలువైంది.





కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి అమ్మవారి ఆలయం

● మీకోసంకు 168 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

జెడ్పీ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన మీ కోసం కార్యక్రమానికి 168 అర్జీలు అందాయి. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అర్జీలు స్వీకరించారు. అర్జీల స్వీకరణలో జిల్లా రెవెన్యూ అధికారి అప్పారావు, డిప్యూటీ సీఈఓ వెంకటరామన్ స్వీకరించారు. వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగం కోసం మోసపోయిన అభ్యర్థుల నివేదికలు వైద్యశాఖ అధికారులు మార్చి, తప్పుడు నివేదికలు ఉన్నతాధికారులకు అందజేశారని బాధితులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారించాలని కోరారు.

– శ్రీకాకుళం పాతబస్టాండ్

● ఎస్పీ గ్రీవెన్స్‌కు 68 ఫిర్యాదులు

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన మీకోసం పరిష్కార వేదికకు ప్రజల నుంచి 68 ఫిర్యాదులు అందాయి. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించి సకాలంలో పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

–శ్రీకాకుళం క్రైమ్



ఫిర్యాదుదారుని సమస్య వింటున్న ఎస్పీ మహేశ్వర రెడ్డి

● నేటితో ముగియనున్న స్కూల్‌గేమ్స్ ఎంపిక పోటీలు



జిల్లా స్కూల్‌గేమ్స్ ఎంపిక పోటీలు మంగళవారంతో ముగియనున్నాయి. గత రెండు వారాలుగా 32 క్రీడాంశాల్లో జరుగుతున్న ఈ ఎంపికల్లో జిల్లా వ్యాప్తంగా 20వేల మంది వరకు ప్రాతినిధ్యం వహించినట్టు అధికారులు చెబుతున్నారు. సోమవారం శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో అండర్–14,17,19 వయో విభాగాల్లో బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలను నిర్వహించారు.

– శ్రీకాకుళం న్యూకాలనీ

● రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం



రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో శ్రీకాకుళం జట్టుతో తలపడిన ఇచ్ఛాపురం జట్టు

రాష్ట్ర వ్యాప్తంగా క్రీడా రంగానికి ప్రా ధాన్యమిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు అన్నారు. సోమవారం కోటబొమ్మాళి హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. కాసేపు పోటీలను వీక్షించారు.

–కోటబొమ్మాళి

భరోసా ఇస్తేనే విధుల్లో ఉంటాం

శ్రీకాకుళం క్రైమ్, ఎచ్చెర్ల క్యాంపస్: కూటమి ప్రభుత్వం తమ ఉద్యోగ భద్రతకు భరోసా కల్పించలేకపోయిందని 193 ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న 753 మందికి పైగా సేల్స్‌మెన్లు, సూపర్‌వైజర్లు సోమవారం మూకుమ్మడిగా రోడ్డెక్కారు. వీరితో పాటు 312 మంది వాచ్‌మెన్లు కూడా ఉన్నారు. వీరంతా సోమవారం ముందుగా ఎచ్చెర్ల ఐఎంఎల్ డీపీఓగా ఉన్న వెంకటరావుకు, అక్కడి నుంచి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు, ఆయన ఆదేశాలతో ఏసీ తిరుపతినాయుడుకు, మళ్లీ అక్కడి నుంచి ఎచ్చెర్ల కొయిరాళ్లలో ఉన్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీకాంత్‌రెడ్డి వద్దకు వెళ్లి వినతిపత్రాలు అందించారు. తమ ఉద్యోగానికి భరోసా ఇస్తేనే విధుల్లో ఉంటామని లేదంటే తాళాలు, దుకాణాలు అప్పజెప్పేసి విధులకు గైర్హాజరవుతామని కుండబద్దలు కొట్టారు. కొత్త మద్యం పాలసీ తెచ్చే వరకు వీరు లేకపోతే ఇబ్బంది తప్పదు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీకాంత్‌రెడ్డి వద్ద ఇదే విషయం 'సాక్షి' ప్రస్తావించగా సేల్స్‌మెన్, సూపర్‌వైజర్లకు నచ్చజెప్పామని, 15 రోజులు సహకరిస్తే కమిషనర్‌తో మాట్లాడి ఉద్యోగానికి ఏదైనా భరోసా కల్పించేలా చూస్తామని చెప్పామన్నారు. ఒకవేళ వారు విధులకు గైర్హాజరీ అయితే ఎక్సైజ్ అధికారి తిరుపతినాయుడు మానిటరింగ్‌లో ఇప్పటికే 12 మంది సీఐలు, 21 మంది ఎస్ఐలు, అదనపు సిబ్బంది మరో 20 మందితో మద్యం అమ్మకాలు సాగించమని ఆదేశాలు ఇచ్చామన్నారు. అప్పటికీ సరిపోకపోతే తాత్కాలిక (ప్రైవేటు వ్యక్తులు) సిబ్బందితో నడిపిస్తామన్నారు.



జిల్లా కలెక్టరేట్ వద్ద సేల్స్‌మెన్, సూపర్‌వైజర్ల ఆందోళన


దొరక్క దొరక్క దొరికింది..!

టెక్కలి: స్థానిక కొడాలి జంక్షన్ సమీపంలో గల మద్యం దుకాణం వద్ద సోమవారం రాత్రి మందుబాబులు భారీగా క్యూ కట్టారు. పట్టణంలో రూ. 150కు లభించే మద్యం దొరకడంలేదు. ఒకే ఒక్క దుకాణం వద్ద ఆ మద్యం దొరుకుతుందనే విషయాన్ని తెలుసుకుని మద్యం ప్రియులు క్యూ కట్టారు. ఎక్సైజ్ అధికారులు, మద్యం దుకాణం సిబ్బంది సిండికేట్‌గా మారి తక్కువ ధరలకు లభించే మద్యాన్ని కృత్రిమంగా కొరత సృష్టించారని మద్యం ప్రియులు ఆరోపిస్తున్నారు.



దుకాణం వద్ద మద్యం కోసం క్యూ కట్టిన మందుబాబులు

బిగుస్తున్న ఉచ్చు



- వైద్యశాఖలో నివేదిక మార్పుపై కలెక్టర్ ఆగ్రహం

అరసవల్లి: జిల్లా వైద్యశాఖలో అక్రమాలకు పాల్పడుతున్న అధికార సిబ్బందిని వెనుకేసుకుని వస్తున్న కీలక అధికారి తీరుపై 'సాక్షి'లో సోమవారం ప్రచురితమైన కథనం వైద్య శాఖను ఓ కుదుపు కుదిపేసింది. ఉద్యోగమిప్పిస్తామంటూ మోసం చేసిన ఘటనలో బాధితుల పక్షాన కాకుండా అక్రమార్కులపై కరుణ చూపుతున్న అధికారుల పాత్రలపై జిల్లా వ్యాప్తంగా తీవ్రంగా చర్చనీయాంశమైంది. సోమవారం బాధితులు నేరుగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌ను కలిసి గోడు వెల్లడించారు. తమకు అన్యాయం జరిగిందని, శాఖాపరంగా ఈనెల 23న జరిగిన విచారణలో బాధితురాలు ఇచ్చిన వాంగ్మూల నివేదికను మార్చేశారన్న అనుమానాలున్నాయని చెప్పడంతో కలెక్టర్ దీన్ని తీవ్రంగా పరిగణనలోకి తీసుకున్నారు. వెంటనే దీనిపై డీఎంహెచ్ఓ డాక్టర్ బి.మీనాక్షిని వివరణ కోరినట్లుగా తెలుస్తోంది. దీంతో వైద్యశాఖ కీలక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

అటు కలెక్టర్..ఇటు ఎస్పీ


ఉద్యోగం కోసం మోసపోయిన బాధితురాలు ఆత్మహత్యాయత్నానికి సైతం పాల్పడటం జిల్లాలో సంచలనమైన సంగతి విదితమే. ఈ మేరకు గత సోమవారం ఎస్పీ మహేశ్వరరెడ్డిని కలిసి బాధితులు తమకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ మోసం చేసిన వ్యక్తుల వివరా లను, సాక్ష్యాలకు కూడా చూపిస్తూ విన్నవించుకున్నారు. అలాగే ఈ సోమవారం నేరుగా జిల్లా కలెక్టర్‌ను కలిసి వివరించారు. ఈ రెండు పరిణామాలతో జిల్లా వైద్య శాఖపై కలెక్టర్, ఎస్పీలు దృష్టి సారించారు. ఇప్పటికే వైద్యశాఖలో అనుమానిత అధికారుల పనితీరును ఇంటెలిజెన్స్‌తో పాటు అవినీతి నిరోధక శాఖాధికారులు కూడా ఆరా తీస్తున్నారు. కీలక ఆధారాల సేకరణలో నిమగ్నమయ్యారు. మరోవైపు తన పేరునే వాడుకుని అక్రమాలకు తెరతీసిన వైనంపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ కూడా మండిపడుతున్నారు. దీంతో జిల్లా వైద్య శాఖలో మరో రెండు మూడు రోజుల్లో తీవ్ర పరిణామాలు వెలుగులోకి రానున్నాయని తెలుస్తోంది.

అవసరమైతే సీఎం దృష్టికి..

గత కొద్ది రోజులుగా బాధితురాలు, ఆమె కుటుంబ సభ్యులు తమకు న్యాయం జరగాలంటూ అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. నివేదిక మార్చేశారన్న అనుమానాల నేపథ్యంలో అవసరమైతే సీఎం దృష్టికి విషయాన్ని తీసుకెళ్తామని చెప్పారు.

● గంజాయి

ఒడిశా టు విశాఖపట్నం.. వయా శ్రీకాకుళం



- ఆగని గంజాయి అక్రమ రవాణా
- 20 రోజుల్లో 300కిలోలకు పైగా పట్టివేత
- పరారీలో 55 మంది క్రయ విక్రయదారులు

శ్రీకాకుళం క్రైమ్ :

ఒడిశా నుంచి శ్రీకాకుళం మీదుగా విశాఖ వరకు గంజాయి అక్రమ రవాణా హైవేపై అడ్డు లేకుండా సాగుతోంది. పోలీసుల దాడులు, అరెస్టులు, పెట్రోలింగ్ తనిఖీలు ఎంత ముమ్మరంగా చేసినా గంజాయి బ్యాచ్ ఆగడాలు ఆగడం లేదు. గడిచిన 20 రోజుల్లో 300 కిలోలకు పైగా గంజాయిను పోలీసులు పట్టుకున్నారు.

జిల్లాలో మూడు ప్రధాన చెక్‌పోస్టులు పురుషోత్తపురం(ఇచ్ఛాపురం), పైడిభీమవరం, పాతపట్నం ఉన్నాయి. ఈ మూడింటిలో పురుషోత్తపురం, పాతపట్నం చెక్‌పోస్టుల వద్దనే అధికంగా గంజాయి దొరుకుతోంది. ఒడిశా నుంచి రవాణా అవుతుండడంతో ఈ చెక్‌పోస్టుల వద్దనే గంజాయి పట్టుబడుతోంది. ఒడిశాలోని గంజాం, గజపతి వంటి జిల్లాల్లో సాగు చేస్తున్న వ్యాపారుల వద్ద తక్కువకు కొని మన జిల్లా మీదుగా విశాఖ తరలిస్తున్నారు. జీఆర్పీ స్టేషన్లు లేని ప్రాంతాలను ఎంచుకుని రవాణా చేస్తున్నారు. గంజాయి అలవాటు ఉన్న వారిలో సంఘ విద్రోహ శక్తులు కూడా ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పరారీలో 55 మంది..

జిల్లాలో గంజాయికి సంబంధించి క్రయ విక్రయదారులు(పాత నేరాలు, కొత్తవి కలిపి) 55 మందికి పైగా పరారీలో ఉన్నారని అప్పట్లో స్వయంగా ఎస్పీ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. వీరిలో ఎనిమిది మందిని పట్టుకున్నారు. జిల్లాలో గంజాయిని 75 శాతం కళాశాలల ప్రాంతాల్లోను, 25 శాతం నదీ ప్రాంతాల్లోనే వాడుతున్నారు. వీరంతా ఒడిశా నుంచి తెచ్చే స్థానిక వ్యాపారుల నుంచి చిన్న చిన్న ప్యాకెట్లుగా (గ్రాముల్లో) కొనుక్కొని సేవిస్తుంటారు.

ఆపరేషన్ గంజాయితో..

ఈ నెల ఆరంభంలో శ్రీకాకుళంలో ఆపరేషన్ గంజాయి పేరుతో ఎస్పీ మహేశ్వరరెడ్డి సమక్షంలో డీఎస్పీ వివేకానంద, సీఐ పైడపునాయుడులు ఓ కేసును ఛేదించారు. ఈ కేసే మొత్తం జిల్లా పోలీసు యంత్రాంగానికి మార్గదర్శకంగా నిలిచింది. ఆపై దాడులు ఉద్ధృతం చేయడంతో గంజాయి లింకులన్నీ బయటపడ్డాయి. ఒడిశా నుంచి సీనా అనే వ్యాపారి నుంచి సరఫరా అయినట్లు తెలిసింది. ఫలితంగా ఈనెల 7న తొమ్మిది మంది అరెస్టు అయ్యారు. ఎనిమిది మంది వ్యసనపరులను డీ అడిక్షన్ సెంటర్లకు పంపారు. ఇరవై రోజుల్లోనే ఇచ్ఛాపురం, కంచిలి, సోంపేట రైల్వేస్టేషన్ల వద్ద, హైవేల దారుల్లో 300 కిలోలకు పైగా గంజాయిని పట్టుకున్నారు.

అవగాహన కల్పిస్తాం..



గంజాయి క్రయ విక్రయాలు, అక్రమ రవాణాకి సంబంధించిన ఫిర్యాదుల నమోదు, డి–అడిక్షన్ కేంద్రాల సేవలకు టోల్ ఫ్రీ నంబర్ 14446కు డయల్ చేయాలి. రిమ్స్‌లో డి–అడిక్షన్ సెంటర్‌ను కూడా పూర్తిస్థాయిలో నిర్వహిస్తాం. జిల్లాలోని రంగస్థల కళాకారులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, ఎన్‌జీఓల సహకారంతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తాం.

– స్వప్నిల్ దినకర్ పుండ్కర్, కలెక్టర్, శ్రీకాకుళం

షీట్లు తెరుస్తున్నాం



ఒడిశా నుంచే మనకు గంజాయి సరఫరా అవుతుంది. చెక్ పోస్టులు, టోల్‌ప్లాజాలు, క్రైమ్ స్పాట్‌ల వద్ద ప్రత్యేక బృందాలతో నిఘా పెట్టాం. డీజీపీ కార్యాలయం నుంచి డ్రగ్ ఐడెంటిటీ కిట్ సాయంతో పరిశోధిస్తున్నాం. ఈ ఏడాదిలోనే 24 కేసుల్లో 71 మందిని అరెస్టు చేసి 490 కిలోల గంజాయి సీజ్ చేశాం. 50 మందికి పైగా సస్పెక్ట్ షీట్స్, ఏడుగురిపై రౌడీషీట్ తెరిచాం.

– కేవీ మహేశ్వరరెడ్డి, ఎస్పీ, శ్రీకాకుళం జిల్లా

నేడే కిరణ దర్శనం



ఆలయంలో ఏర్పాటు చేసిన బారికేడ్లు

అరసవల్లి: ఆదిత్య క్షేత్రంలో అపురూప దర్శనానికి వేళయ్యింది. మంగళవారం సూర్యోదయ సమయంలో తొలి సూర్యకిరణాలు నేరుగా గర్భాలయంలోని ఆదిత్యుని మూలవిరాట్టును తాకే దృశ్యాన్ని తిలకించేందుకు ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ ఈఓ వై.భద్రాజీ, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మల ఆధ్వర్యంలో భక్తులకు కిరణ దర్శనమయ్యేలా ప్రత్యేకంగా ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేశారు. అలాగే సూర్యోదయ సమయానికి అరగంట ముందే ఆలయంలోకి అనుమతి ఇవ్వనున్నామని అధికారులు స్పష్టం చేశారు. సెల్‌ఫోన్లు, కెమెరాలు ఆలయంలోనికి అనుమతించేది లేదని ప్రకటించారు. బుధవారం కూడా కిరణ దర్శనానికి భక్తులకు అనుమతి ఉందని, అంతవరకు ఏర్పాట్లు ఇలాగే ఉంచనున్నట్లుగా అధికారులు తెలియజేశారు.

క్లుప్తంగా

డీఎస్ఓగా సూర్యప్రకాశరావు



శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా పౌర సరఫరాల అధికారిగా జి.సూర్యప్రకాశరావును నియమించారు. ఈ మేరకు ఆయన డీఎస్ఓ కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన విశాఖపట్నం డీఎస్ఓ పనిచేస్తూ బదిలీపై శ్రీకాకుళం వచ్చారు.

అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 7 ట్రాక్టర్లు సీజ్



ఆమదాలవలస పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న ట్రాక్టర్లు

ఆమదాలవలస : మండలంలోని నాగావళి నది పరివాహక ప్రాంతమైన దూసి గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి ఏడు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు స్థానిక ఎస్ఐ కె.వెంకటేష్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు నదీ పరివాహక ప్రాంతం నుంచి పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు. అయితే కలెక్టర్ కార్యాలయం నుంచి, ఎస్పీ కార్యాలయం నుంచి వచ్చిన సమాచారంతోనే తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే ఆమదాలవలస పోలీసులు స్పందించి ఇసుక అక్రమ రవాణా వాహనాలు పట్టుకుంటున్నట్లు ఆమదాలవలస నియోజకవర్గ వాసులు చర్చించుకుంటున్నారు.

ఇసుక లారీల పట్టివేత

కొత్తూరు: మండలంలోని మెట్టూరు వద్ద మూడు, స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద రెండు ఇసుక లారీలను స్థానిక సీఐ చింతాడ ప్రసాదరావు పట్టుకున్నారు. ఇసుక లారీల డ్రైవర్ల వద్ద ఒడిశా రాష్ట్రం పెంగూడ ఇసుక ర్యాంపు రశీదులు ఉన్నట్లు సీఐ చెప్పారు. ఎక్కడ నుంచి ఇసుక లోడు చేశారన్నది నిర్ధారించాలని కొత్తూరు తహసీల్దార్‌ను కోరినట్లు చెప్పారు. ఇసుకను భామిని మండలంలో లోడ్ చేసినట్లు లారీ డ్రైవర్లు ఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్లకు చెప్పినట్లు తహసీల్దార్ తెలిపారు.

సబ్జెక్టు కాంట్రాక్టు పోస్టులకు ఇంటర్వ్యూల నిర్వహణ

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో సోమవారం సబ్జెక్టు కాంట్రాక్టు పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. సైన్స్, ఆర్ట్స్, ఇంజినీరింగ్ సబ్జెక్టులకు ఇంటర్వ్యూలు ఆయా కళాశాలల్లో నిర్వహించారు. పదుల సంఖ్యలో అభ్యర్థులు హాజరయ్యారు.

అనాథ బాలుడికి శస్త్ర చికిత్స



శస్త్ర చికిత్స చేసిన బాలుడు సోహిల్‌తో ఏ-1 ఆస్పత్రి వైద్యులు వెంకటరావు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనురాగ నిలయంలో ఉంటున్న సోహిల్ (8) అనే అనాథ బాలుడికి ఏ-1 ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ మూల వెంకటరావు శస్త్ర చికిత్స చేసి సోమవారం ప్రాణాలు కాపాడారు. సోహిల్ ఆదివారం కడుపునొప్పి, వాంతులు కావడంతో ఏ-1 ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడి వైద్యులు పరీక్షించి అత్యవసర శస్త్ర చికిత్స చేయాల్సి ఉందని చెప్పారు. రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు కోరిన మేరకు ఉచితంగా అపెండిసైటిస్ శస్త్ర చికిత్సను నిర్వహించారు.

ప్రణాళికే కీలకం

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో జాతీయ ఉపాధి పనులకు, ఇతర పథకాలకు ప్లానింగ్ కీలకమని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బి.సుధాకర్ అన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల ఉపాధి హామీ పథకం సిబ్బందితో సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ప్రాజెక్టు డైరెక్టర్ సుధాకర్ మాట్లాడారు. 38 రకాల వ్యవసాయ అనుబంధ పనులకు అత్యధిక ప్రాధాన్యతను ఇవ్వాలని స్పష్టం చేశారు. గ్రామ సభలు నిర్వహించే సమయంలో పెద్ద ఎత్తున అన్ని వర్గాల ప్రజలు పాల్గొనేలా చర్యలు చేపట్టాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని హెచ్చరించారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి



సంఘటన స్థలంలోనే మృతి చెందిన రామయ్య

నరసన్నపేట: జాతీయ రహదారిపై జడూరు కూడలి వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పోలాకి మండలం రేగుపాడుకు చెందిన సిర్లాపి రామయ్య(65) మృతి చెందారు. రామయ్య రోడ్డు దాటుతుండగా విశాఖ నుంచి టెక్కలి వైపుకు వెళ్తున్న కారు ఢీకొట్టింది. దీంతో ఆయన సంఘటన స్థలంలోనే ప్రాణాలు విడిచారు. ప్రమాద స్థలాన్ని ఎస్ఐ దుర్గాప్రసాద్ పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం మార్చురీకి పంపారు.

మానవత్వమే ప్రదానం

- రక్తదానం ప్రాణదానంతో సమానం
- అవసరానికి సరిపోని నిల్వలు
- నేడు జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం

సాయం చేయాలనే తలపు ఉంటే చాలు మీరు అందరి బంధువుగా మారవచ్చు. ఆపదలో ఉన్న వారిని చూసి మనసు చివుక్కుమనే లక్షణం ఉంటే చాలు వారితో 'రక్త సంబంధం' కలుపుకోవచ్చు. నేడు జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం. అందరికీ అవగాహన పెరిగి రక్తదానం అనేది అలవాటుగా మారితే.. ఎందరో అభాగ్యుల ఆయుష్షు పెరుగుతుంది. అలాంటి రోజు ఒకటి రావాలనేదే అందరి ఆకాంక్ష. ఆ దిశగా అన్ని ప్రయత్నాలు జరుగుతున్నాయి.



రక్తదానం చేస్తున్న దృశ్యం(ఫైల్)

శ్రీకాకుళం కల్చరల్: రక్తదానంపై అవగాహన పెరుగుతున్నా ఇంకా చాలా మంది అపోహలు వీడడం లేదు. జిల్లాలో రక్తదాతల సంఖ్య ఎంతో తెలుసా..? జిల్లా జనాభాలో కేవలం ఒక్కశాతం. అవసరాలైతే అంతకు మించి ఉన్నాయి. అయితే జిల్లా అవసరాలకు సరిపడా రక్తం సేకరణ జరగడం లేదని వైద్యులు అంటున్నారు. రెడ్‌క్రాస్ వంటి సంస్థలు నిరంతరం కృషిచేస్తున్నా ఇంకా నిల్వలు పెంచాల్సి ఉంది. రక్తాన్ని యంత్రాలతో తయారు చేయలేము. ఒక మనిషి దానం చేస్తే మాత్రమే రక్తం నిల్వ చేసే వీలుంటుంది.

రక్త నిల్వ కేంద్రాలు

రక్తాన్ని సేకరించేందుకు ప్రత్యేకంగా బ్లడ్ బ్యాంకులను ఏర్పాటు చేశారు. జిల్లాలో అతి పెద్ద రక్తనిల్వ కేంద్రంగా శ్రీకాకుళం రెడ్‌క్రాస్ నిలుస్తుంది. రక్తదాతలు ఎవరైనా ముందుకు వస్తే 9133008585 నంబరుకి కాల్ చేయాలి. వీరు సేకరించిన రక్తం జిల్లా కేంద్రంలో రిమ్స్‌కు, పాతపట్నం, టెక్కలి, పాలకొండల ప్రభుత్వ ఆస్పత్రులకు అందిస్తారు. వీరు ఇప్పటికి రూ.1,10,700ల యూనిట్లు సేకరించి, 1,05,630 యూనిట్లు అందించారు.

- జిల్లాకేంద్రంలోనే న్యూ బ్లడ్ బ్యాంకు 2019లో ఏర్పాటు చేశారు. ఇప్పటికి 31,410 యూనిట్లు సేకరించగా, అందులో 30384 యూనిట్లు రక్తం అందించారు. వీరి ఫోన్ నంబర్ 9550501503.
- లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బ్లడ్ బ్యాంకు నిర్వహిస్తున్నారు. ఇప్పటికి 7160 యూనిట్లు సేకరించి 6610 యూనిట్లు అందించారు. వీరి ఫోన్ నంబరు 7995636077.
- జెమ్స్ ఆస్పత్రిలో కూడా రక్త సేకరణ కేంద్రం నిర్వహిస్తున్నారు. వారి నంబరు 9247311030.
- పలాసలో ప్రాణదాత రక్తసేకరణ కేంద్రం ఉంది. వీరు ఇప్పటికి 6500 యూనిట్లు సేకరించి 6450 యూనిట్లు అందించారు. వీరి ఫోన్ నంబరు 8567892777.
- ఉద్దానం బ్లడ్ బ్యాంకు సోంపేటలో ఉంది. ఇప్పటి వరకు 1070 యూనిట్లు సేకరించగా, 1020 యూనిట్లు అవసరమైన వారికి అందించారు. వీరి ఫోన్ నంబరు 76069 99399.
- రిమ్స్‌లో కేంద్రం ఉన్నా సేకరణ జరగడం లేదు.

అపోహ వద్దు..

ఆరోగ్యంగా ఉన్న వారు ఎవరైనా రక్తదానం చేయవచ్చు. కేవలం 300 మిల్లీలీటర్లు మాత్రమే తీసుకుంటారు. ఏడాదిలో నాలుగు పర్యాయాలు రక్తాన్ని దానం చేయవచ్చు. రక్తాన్ని సేకరించినపుడు 300 మిల్లీలీటర్ల రక్తాన్ని మాత్రమే సేకరిస్తారు. రెడ్‌క్రాస్ వంటి సంస్థలు దాతలకు ప్రోత్సాహకాలు కూడా ఇస్తున్నాయి.

20 సార్లు రక్తదానం చేశాను



నేను ఇప్పటికి 20 సార్లు రక్తదానం చేశాను. నాలుగు నెలలకు ఒకసారి రక్తం ఇస్తుంటాను. రక్తదానం చేయడం ఒక తృప్తిగా ఉంటుంది. యువకులు రక్తదానం చేసేందుకు సిద్ధంగా ఉండాలి.

– పి.శ్రీకాంత్, ఎన్‌సీఎస్ డైరెక్టర్

37 సార్లు రక్తదానం



నరసన్నపేటకు చెందిన లయన్స్ క్లబ్ ప్రతినిధి బోయిన బాలకృష్ణ 37 మార్లు రక్తదానం చేశారు. విద్యార్థి దశ నుంచి రక్తదానం చేస్తున్నట్లు తెలిపారు. అవసరం, రోగి పరిస్థితి బట్టి ఇక ముందు కూడా రక్తదానం చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

– బోయిన బాలకృష్ణ, లయన్స్ క్లబ్బు ప్రతినిధి, మారుతీ నగర్, నరసన్నపేట

మొదటి రక్తదానం నాదే



జిల్లాలో నేనే మొదట రక్తదానం చేశాను. 1993లో అప్పటి గవర్నర్ రంగరాజన్ సతీమణి జిల్లా పర్యటనకు వచ్చిన సమయంలో ప్రభుత్వ ఆస్పత్రిలో ఎ పాజిటివ్ రక్తం అందించాను. అలాగే రక్తదానం కోసం వెయ్యి ప్రదేశాల్లో ప్రచారం చేశాను. ఇప్పటికి 25 సార్లు రక్తం అందించాను.

– డాక్టర్ మంత్రి వెంకటస్వామి, సామాజిక కార్యకర్త, శ్రీకాకుళం

65 సార్లు రక్తమిచ్చా..



నేను స్టేట్ బ్యాంకులో పనిచేశాను. ప్రతి మూడు నెలల కొకసారి రక్తదానం చేస్తుంటాను. మా మేనేజర్‌ను చూసి నేను స్ఫూర్తి పొందాను. నా సేవలను గుర్తించి నాకు రెడ్‌క్రాస్ పలుసార్లు అవార్డులు, సత్కారాలు కూడా చేసింది.

– సీహెచ్ రమణమూర్తి, విశ్రాంత బ్యాంకు ఉద్యోగి, శ్రీకాకుళం

మూడు నెలలకోసారి



మూడునెలలకోసారి రక్తదానం చేస్తుంటా. ఇప్పటికి 23సార్లు రక్తదానం చేశాను. 2014లో మా బాబాయి చనిపోయినపుడు రక్తం అవసరమైంది. అప్పటి పరిస్థితిని చూసి రక్తదానం అలవాటు చేసుకున్నాను.

– డి.ఈశ్వర్‌కుమార్, కలెక్టర్‌రేట్‌లో సివిల్ సప్లయిస్ ఉద్యోగి, శ్రీకాకుళం

ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేస్తే సహించబోం



జగనన్న కాలనీలో ధ్వంసమైన అక్షరాల ముక్కలను చూపిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి వంద రోజుల పాలన పూర్తయినప్పటికీ ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేయడంలో విఫలమైందని, ఊళ్లలో ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం, అరాచకాలతో పాలన సాగిస్తున్నారని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆరోపించారు. మండలంలోని ప్రహరాజపాలేంలో వైఎస్సార్ జగనన్న కాలనీలోని నిర్మించిన ఆర్చిపై ఉన్న వైఎస్సార్ జగనన్న కాలనీ పేరును దుండగులు తొలగించారు. ఆ ఆర్చిని నాయకులతో కలిసి ఆమె సోమవారం పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం 100 రోజుల పాలనలో భూ ఆక్రమణలు, ఇసుక దోపిడీ, కక్ష సాధింపు తప్ప ఇంకేమీ చేయలేదని గుర్తు చేశారు. ఆమెతో పాటు ఎంపీపీ దొర సావిత్రమ్మ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు సవిరిగాన ప్రదీప్, మాజీ సచివాలయ మండల కన్వీనర్ ఎనుగుతల సూర్యం, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ మద్దు తాతయ్య, మండల ప్రత్యేక సలహాదారుడు ఎం.గణపతిరావు, కోఆప్షన్ సభ్యుడు మాదవ్ పుల్లాయ్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాముల తనిఖీ



ఈవీఎం గోదాములు పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: త్రైమాసిక తనిఖీల్లో భాగంగా కలెక్టర్ కార్యాలయంలోని ఈవీఎం గోదాములను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం తనిఖీ చేశారు. గోదాములకు వేసిన సీళ్లను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి సిబ్బందితో తెరిపించి పరిశీలించారు. అనంతరం వాటికి తిరిగి సీళ్లు వేయించారు.

ఓటర్ల జాబితా రూపకల్పనకు సహకరించాలి

ఓటర్ల జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీల ప్రతినిధులు అధికారులకు సహకారం అందించాలని జిల్లా రెవెన్యూ అధికారి అప్పారావు అన్నారు. ఈవీఎం గోదాముల పరిశీలన అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన మాట్లాడారు. సాధారణ ఓటర్ల జాబితా రూపకల్పనపై షెడ్యూల్ ప్రకారం అధికారులు పనిచేస్తున్నారని, బీఎల్ఓలతో బీఎల్ఏలు సమన్వయం చేసుకొని పనిచేయాల్సిన అవసరం ఉందని కోరారు.

భవనాలు వదిలి పాకలపై కక్ష

జలుమూరు: కరకవలసలో కూటమి నాయకులు అధికారులను అడ్డం పెట్టుకుని పేదలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. గడచిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతుగా ఉన్నారని గ్రామానికి చెందిన పామల బుడ్డోడు తన ఆవేదన వ్యక్తం చేశారు. ఇల్లు లేక తాను ఆవుల మంద స్థలంలో వేసుకున్న పాకను తొలగించేందుకు నోటీసులు జారీ చేశారని తెలిపారు. టీడీపీకి చెందిన గురువిల్లి చిన్నవాడు, ఆదినారాయణ, మహేశ్వరం సూర్యంతోపాటు పలువురు కొత్త చెరువు గర్భంలో ఇళ్లు కట్టుకున్నారని, అలాంటి వారిని వదిలేసి పాకలపై కక్ష ఎందుకని ప్రశ్నించారు.

దీనిపై తహసీల్దార్‌కు విన్నవించామని, న్యాయం జరగకుంటే కోర్టును ఆశ్రయిస్తామన్నారు. దీనిపై తహసీల్దార్ జి.లక్ష్మీనారాయణను వివరణ కోరగా ఫిర్యాదు మేరకు రెవెన్యూ సిబ్బందిని పంపి పార్టీలకు అతీతంగా ఆక్రమణలు తొలగిస్తామన్నారు.

దొంగలు దొరికారు

- గార, లావేరు చోరీలను ఛేదించిన పోలీసులు
- 24 తులాల బంగారం, కిలో వెండి రికవరీ
- ఇద్దరు నిందితుల అరెస్టు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి

శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళం సబ్ డివిజన్ పరిధిలోని గార (3), లావేరు (01) మండలాల్లో ఇటీవల జరిగిన నాలుగు చోరీ కేసులకు సంబంధించి ఇద్దరు నిందితులను పట్టుకున్నట్లు ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన పత్రికా విలేకరుల సమావేశంలో వెల్లడించారు. వీరి వద్ద నుంచి సుమారు 24 తులాల బంగారం, కిలో వెండి స్వాధీనం చేసుకున్నామని, రూ.42 వేలు వరకు నగదును రికవరీ చేయాల్సి ఉందని ఎస్పీ అన్నారు. ఎస్పీ తెలిపిన వివరాల్లోకి వెళితే..

గారలో మూడు కేసుల్లో..

ఈ నెల 29 ఉదయం జోగిపంతుల పేట గ్రామానికి చెందిన పిట్ట రమణ ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి తులం బంగారం దోచుకుపోయారు. దీనిపై రూరల్ సీఐ పైడపునాయుడు, గార ఎస్ఐ జనార్దన కలిసి ఓ ప్రత్యేక బృందంగా ఏర్పడి గార మండలం బూరవెల్లి కూడలి వద్ద మాటువేశారు. ఆటోలో దిగిన ఓ వ్యక్తి పోలీసులను చూడగానే తడబడటంతో అదుపులోకి తీసుకుని విచారించగా శ్రీకాకుళంలోని అలికాం కాలనీకి చెందిన నాగళ్ల నాగరాజు (32)గా తెలిసింది. పశువుల వ్యాపారం చేస్తుంటానని, వ్యాపారం సరిగా లేక చేసిన అప్పులు తీర్చలేక దొంగతానికి పాల్పడినట్లు అతను చెప్పాడు.

మరికొన్ని చోరీల్లో సైతం..

పోలీసుల విచారణలో నాగరాజు మరికొన్ని చోరీల్లో కూడా పాల్గొన్నట్లు వెల్లడించాడని ఎస్పీ అన్నారు. గత ఏడాది నవంబరు 25న ఇదే గార మండలం లింగాలవలసలోని ఒక ఇంట్లో తులంముప్పావు బంగారు వస్తువులు దొంగిలించానని, డిసెంబరు 27న దువ్వపేటలోని మరో ఇంట్లో నాలుగున్నర తులాల బంగారం, కాలిపట్టీలు, ఇతర వెండి వస్తువులు కలిపి కిలో వరకు దొంగిలించినట్లు చెప్పాడన్నారు. కొంతబంగారాన్ని అలికాం ఏపీజీవీబీ బ్రాంచిలో తాకట్టు పెట్టానని, మరికొంత ఇంట్లో దాచినట్లు చెప్పడంతో పోలీసులు వెళ్లి మొత్తంగా ఏడుంపావు తులాల బంగారం, కిలో వెండి స్వాధీనం చేసుకున్నారు.

లావేరులో ఒక కేసులో..

ఈ నెల 27న లావేరు మండలం బెజ్జిపురానికి చెందిన తాళాబత్తుల సూరిబాబు ఇంటికి తాళం వేసి ఎస్.కోట వెళ్లారు. తిరిగి 29న వచ్చి చూసేసరికి తన ఇంట్లో ఉన్న 16 తులాలకు పైగా బంగారం, రూ.17 వేలు నగదు మాయమవ్వడంతో ఫిర్యాదు చేశారు. దీంతో జేఆర్ పురం సీఐ అవతారం, లావేరు ఎస్ఐ లక్ష్మణరావులు టీమ్‌గా ఏర్పడి విచారణ చేపట్టారు. బెజ్జిపురం గ్రామంలోనే వడ్రంగిగా పనిచేస్తున్న జవ్వాది ప్రసాద్ (32) అనే యువకుడు సూరిబాబు ఇంటికి పనికి వెళ్లి ఇంట్లో ఉన్న చెక్క బీరువాలో బంగారు వస్తువులు ఉండటం చూశాడు. అప్పటికే వ్యసనాలు ఎక్కువగా ఉండటంతో ఈనెల 28న ఎవరూ లేని సమయం చూసి ఇంట్లో చొరబడి దొంగిలించాడు.

నిందితులిద్దరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు ఎస్పీ చెప్పారు. నాలుగు కేసులను డీఎస్పీ వివేకానంద సమక్షంలో చాకచక్యంగా ఛేదించిన పోలీసులకు ఎస్పీ అభినందనలు తెలిపారు. 2023–24 మార్చి వరకు జరిగిన చోరీల్లో మధ్యప్రదేశ్, రాజస్థాన్ గ్యాంగుల హస్తం ఉందన్నారు. తొందరలోనే పట్టుకుంటామన్నారు.

ఎక్సైజ్ విభాగంలో సీఐ, ఎస్ఐలకు స్థానచలనం

శ్రీకాకుళం క్రైమ్ : విశాఖపట్నం జోన్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయం నుంచి వచ్చిన ఉత్తర్వుల మేరకు జిల్లాలో ఎక్సైజ్ విభాగంలో 12 మంది సీఐలను నియమించారు. 21 మంది ఎస్ఐలకు స్థానచలనం జరిగింది. సీఐల్లో ఎంవీ గోపాల కృష్ణ (శ్రీకాకుళం), జి.సతీష్‌కుమార్ (ఆమదాలవలస), ఎల్.అనురాధాదేవి (రణస్థలం), వై.రాజు (పొందూరు), ఎస్వీ రమణమూర్తి (నరసన్నపేట), కె.కృష్ణారావు (పాతపట్నం), బీహెచ్ కిరణ్మణీశ్వరి (కొత్తూరు), ఎస్కే మీరాసాహెబ్ (టెక్కలి), కె.గాయత్రి (కోటబొమ్మాళి), కె.మల్లికార్జునరావు (పలాస), కె.బేబీ (సోంపేట), పీడీ ప్రసాద్ (ఇచ్ఛాపురం) ఉన్నారు.

ఎస్ఐలు	సెబ్ నుంచి రిలీవైన స్థానం	ప్రస్తుత ఎక్సైజ్ స్టేషన్
బి.రాజేష్	కాకినాడ ఏసీ డిస్టలరీస్	శ్రీకాకుళం
ఆర్.మహేష్‌బాబు	పెందుర్తి	శ్రీకాకుళం
జె.కావ్య	నరసన్నపేట	ఆమదాలవలస
సిహెచ్‌కుమార్	కోటబొమ్మాళి	ఆమదాలవలస
ఎస్.షర్మిళ	టెక్నికల్‌వింగ్, శ్రీకాకుళం	రణస్థలం
పి.కరుణప్రసాద్	పాడేరు	పొందూరు
ఎస్.గురుమూర్తి	చీపురుపల్లి	నరసన్నపేట
బి.శ్రీనివాసరావు	పాతపట్నం	రిటెన్షన్
ఎల్ మహేశ్వరరావు	విశాఖ, డీసీ స్క్వాడ్	కొత్తూరు
ఎం.వేణు	ఐఎంఎల్ డిపో, శ్రీకాకుళం	టెక్కలి
పి.సత్యనారాయణమూర్తి	అరకు	టెక్కలి
షయ్యిక్ షైదాబీ	డీఎస్ఈవో, ఏఎస్ఆర్ జిల్లా	పలాస
పి.జాన్‌ప్రసాద్	పాయకరావుపేట	సోంపేట
కె.కళ్యాణి	నెల్లిమర్ల	ఇచ్ఛాపురం
జిసివి రమణారావు	డీటీఎఫ్, పలాస	ఏఈఎస్,టాస్క్‌ఫోర్స్ పలాస
బి.అప్పారావు	ఈఎస్‌స్క్వాడ్, విశాఖ	ఈఎస్‌టాస్క్‌ఫోర్స్‌శ్రీకాకుళం
పి.రాజేశ్వరరావు	అనకాపల్లి ఐఎంఎల్‌డిపో	ఏసీ ఎన్‌ఫోర్స్.శ్రీకాకుళం
జె.సుజాత	అరోమో, ఏఎస్ఆర్‌జిల్లా	ఏసీ ఎన్‌ఫోర్స్, శ్రీకాకుళం
పీటీవీఎస్ఎన్‌మూర్తి	శ్రీకాకుళంఐఎంఎల్‌డిపో	పురుషోత్తపురంచెక్‌పోస్టు
వీవీ జోగారావు	అనకాపల్లి ఐఎంఎల్‌డిపో	వసుంధర చెక్‌పోస్టు
యూవీవీ నాగరాజు	కోనవలస చెక్‌పోస్టు	ఎచ్చెర్ల ఐఎంఎల్‌డిపో

వీరే కాక..

వి.లీలారాణి (ఈఎస్‌టీఎఫ్, శ్రీకాకుళం), ఎస్.పిచ్చేశ్వరరావు (అసిస్టెంట్ కమీషనర్, ఎన్‌ఫోర్స్‌మెంట్), బీవీ మురీధర్ (ఐఎంఎల్ డిపో, ఎచ్చెర్ల ఈఎస్‌వో), జీవీ రమణ (మొబైల్‌పార్టీ, ఇచ్ఛాపురం), కె.సునీల్‌కుమార్ (సోంపేట), ఎఎం ఇందుమతి పాతపట్నం) నియమితులయ్యారు.

జిల్లాలో 15 మంది తహసీల్దార్లకు బదిలీలు



శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో తహసీల్దార్లను బదిలీలు చేస్తూ సోమవారం కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. సెప్టెంబర్ 22 నాటికి పూర్తిచేయాల్సిన బదిలీలు ఇంకా కొనసాగుతున్నాయి.

పేరు	ప్రస్తుతం	బదిలీ అయిన చోటు
బి.పాపారావు	కొత్తూరు	మెళియాపుట్టి
ఎస్.హనుమంతరావు	మెళియాపుట్టి	కలెక్టరేట్ హెచ్ సూపరెంటెండెంట్
బి.రాజేశ్వరరావు	కలెక్టరేట్ సి సెక్షన్	టెక్కలి ఆర్డీవో కార్యాలయం ఏఓ
డి.రామమూర్తి	కలెక్టరేట్ డి సెక్షన్	టెక్కలి ఆర్డీవో కార్యాలయం కేఆర్‌సీసీ తహసీల్దార్
బి.ప్రకాశ రావు	కలెక్టరేట్ హెచ్ సెక్షన్	పలాస ఆర్డీవో కార్యాలయం ఏఓ
బీఎస్ఎస్ఎస్‌నారాయణ	కేఆర్‌సీ టెక్కలి	కలెక్టరేట్ డి సెక్షన్ సూపరింటెండెంట్
ఎస్.హైమావతి	ఏఓ పలాస ఆర్డీఓ	తహసీల్దారు మందస
ఎన్.రమేష్ కుమార్	పొందూరు	కంచిలి
కె.రవిచంద్ర	అనకాపలి	హిరమండలం
డి.సీతారామయ్య	మన్యం	వజ్రపుకొత్తూరు
పి.సోమేశ్వరరావు	మన్యం	నందిగాం
పి.రమేష్ కుమార్	మన్యం	సంతబొమ్మాళి
టి.కళ్యాణచక్రవర్తి	విజయనగరం	పలాస
వైవీ పద్మావతి	ఎల్ఎన్ పేట	బూర్జ
జె.ఈశ్వరమ్మ	బూర్జ	ఎల్ఎన్‌పేట

కనీస వేతనాలు ఇవ్వాలని ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: కాంట్రాక్టు, ఆప్కాస్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, పార్ట్ టైమ్ తదితర పేర్లతో ఉన్న పర్మినెంట్ ఇతర కాంట్రాక్టు ఉద్యోగ, కార్మికులను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కార్మికుల హక్కుల సాధనకు సెప్టెంబర్ 30వ తేదీన 'డిమాండ్స్ డే' జరపాలని సీఐటీయూ అఖిల భారత పిలుపుమేరకు సోమవారం శ్రీకాకుళం కలెక్టర్ కార్యాలయం వద్ద సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్(సీఐటీయూ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రిమ్స్‌లో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బందికి కనీస వేతనాలు ఇవ్వడం లేదని, కాంట్రాక్టర్లు చెల్లించాల్సిన పీఎఫ్ వాటాను కార్మికుల వేతనాలు నుంచే మినహాయిస్తున్నారని అన్నారు. ఇతర సంస్థల్లోని కాంట్రాక్టు కార్మికులకు కూడా శ్రమ తప్పడం లేదన్నారు. ధర్నా అనంతరం జిల్లా పరిషత్ మీ కోసంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు వినతిపత్రం అందించారు.

అలవాటే ప్రాణం తీసింది



జడ్డు వరహాలమ్మ

పొందూరు: చుట్ట కాల్చే అలవాటు ఓ వృద్ధురాలి ప్రాణం తీసింది. లోలుగు గ్రామంలో సోమవారం ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన జడ్డు వరహాలమ్మ(93) తన అల్లుడు లోలుగు సూర్యనారాయణ ఇంటిలో ఉంటారు. భర్తతో పాటు ఒక్కగానొక్క కుమార్తె మరణించడంతో అల్లుడు సూర్యనారాయణ ఇంటిలోనే ఉంటున్నారు. వరహాలమ్మ ఎప్పటిలాగే చుట్ట కాల్చుతుండగా నోటిలో ఉన్న చుట్ట చీరపై పడింది. ఫ్యాను గాలికి చుట్ట నుంచి మంటలు చెలరేగి దుస్తులకు అంటుకుంది. కుటుంబ సభ్యులు చూసి మంటలు ఆర్పేలోగా 90 శాతం శరీరం కాలిపోయింది. ఆస్పత్రికి తరలించేలోగా ఇంటి వద్దనే మృతి చెందింది. అల్లుడు సూర్యనారాయణ ఫిర్యాదు మేరకు ఎస్ఐ వి.సత్యనారాయణ కేసు నమోదు చేశారు. అనంతరం శవపంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

బస్సు నుంచి జారిపడి మహిళకు గాయాలు

టెక్కలి రూరల్: మండలంలోని శ్రీరంగం గ్రామం వద్ద బస్సు నుంచి జారిపడి గొడ సుశీల అనే మహిళకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరా లు ప్రకారం.. వజ్రపుకొత్తూరు మండలం పొల్లాడ గ్రామానికి చెందిన గొడ సుశీల అనే మహిళ పలాస నుంచి టెక్కలి వైపు వస్తున్న ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తుండగా టెక్కలి సమీప శ్రీరంగం గ్రామం వద్ద బస్సు ఆగేలోపు ఒక్కసారిగా బస్సు దిగే ప్రయత్నంలో కిందకు పడిపోయింది. ప్రమాదంలో ఆమెకు తీవ్ర గాయాలు కావడంతో హుటాహుటిన టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదుచేయనున్నట్లు టెక్కలి పోలీసులు తెలిపారు.